# ఎన్‌కౌంటర్

## తెలిదేవర భానుమూర్తి

మంచు తెరలు ఇంకా వీడలేదు. మబ్బుల దుప్పటిని తొలగించుకొని సూర్యుడు ఇంకా కళ్లు తెరవలేదు. చెట్టు మీది కాకులు కావ్ కావ్ అంటూ ఎటో వైపు ఎగిరిపోతున్నాయి. రోడ్డు మీద జనసంచారం ఇంకా మొదలు కాలేదు. కానీ ఇరానీ హోటల్లో అప్పుడే సందడి మొదలైంది.

మాజీ న్యాయమూర్తి సత్యమూర్తి పక్కమీద నుంచి లేచి వళ్లు విరుచుకొన్నారు. ఎదురుగా ఉన్న గోడ గడియారం కేసి చూశారు. సరిగ్గా అప్పుడు ఐదుగంటలైంది. ఆరోజునే కాదు రోజూ సత్యమూర్తి అదే సమయానికి నిద్రలేస్తారు.



తెల్లవారు జామునే లేవడం చిన్నప్పటి నుంచే ఆయనకు అలవాటు. అందు క్కారణం ఆయన తాతగారే. రోజూ తెల్లవారుజామునే లేచి కూచుని ఆ ముసలాయన గొంతెత్తి తత్వాలు పాడేవాడు. ఇంట్లో వాళ్ల నిద్ర పాడుచేసేవాడు. విసుక్కుంటూ అందరూ లేచి కూచునేవారు. సత్యమూర్తి వాళ్లింటి ముందు ఖాళీస్థలం ఉండేది. ఆ స్థలంలో కొబ్బరిచెట్లూ, జామచెట్లూ, నిమ్మచెట్లూ, గులాబీ మొక్కలూ ఉండేవి. అక్కడక్కడా పచ్చగడ్డి ఉండేది. తెల్లవారుజామున మంచు కణాలతో ఆ గడ్డి తడిసేది. తడిసిన ఆ పచ్చగడ్డిపై నడుస్తుంటే కితకితలు పెట్టినట్టుండేది. సాయంత్రంపూట సత్యమూర్తి అతని చెల్లెలూ ఆ పచ్చగడ్డిలో ఆడుకొనేవారు. ఒక్కోసారి ఆ గడ్డిలో మఖ్‌మల్ లాంటి ఆరుద్ర పురుగులు కనిపించేవి. సత్యమూర్తి ఆరుద్ర పురుగుల్ని పట్టుకొని అగ్గిపెట్టెలో ఉంచేవాడు. అవి తినడానికి బంతి ఆకులు పెట్టేవాడు. చిన్నప్పుడు ఇంటి ముందు సరదాగా నడవటం కాస్తా పెద్దయ్యాక సత్యమూర్తికి అలవాటుగా మారింది. తెల్లవారు జామునే గంటసేపు నడిచొస్తే గాని ఆయన తోచదు. వాన పడినా సరే గొడుగు పట్టుకొని ఆయన నడచి వస్తుంటారు. చిన్నప్పుడు సత్యమూర్తికి లెక్చరర్ కావాలని ఉండేది. బడిపంతులు కొడుకు బడిపంతులే కావొద్దని వాళ్ల నాన్న పట్టుబట్టాడు. డిగ్రీ అయ్యాక లా చదివించాడు. లా పాసవడంతో సత్యమూర్తి కాస్తా వకీలుగా మారారు. ఆ తరువాత న్యాయమూర్తిగా పనిచేసి పదవీ విరమణ గావించారు.

రోజూ లాగే ఆ రోజూ సత్యమూర్తి వాకింగ్‌కు వెళ్లారు. వాకింగ్ నుంచి తిరిగి రాగానే ఇంటి తలుపు వద్ద ఉన్న ఆ నాటి పేపర్ ఆయనకు కనిపించింది. పత్రిక తీసుకొని ఆయన చూశారు. మొదటిపేజీలో ఆయనకు తన ఫోటో కనిపించింది. దాని కింద రాసిన రైటప్ చదవగానే ఆయన ఒళ్లు మండిపోయింది. దాన్ని ఎవరైనా చూస్తే తాను బాధ్యతలేని అధికారినని అనుకొంటారు. చాటుగా నవ్వుకొంటారు. ఆ ఫోటో సత్యమూర్తి ఎవరివద్దో లంచం తీసుకొంటున్నట్లుగా లేదు. కేవలం ఆయన ఫలహారం చేస్తున్నట్లుగా ఉంది. టేబుల్ మీద ఒక పేట్లో ఇడ్లీలున్నాయి. మరో ప్లేట్లో పూరీలున్నాయి. ఇంకో ప్లేట్లో రసగుల్లాలున్నాయి. ఫలహారం చేస్తున్న సత్యమూర్తితో పాటు ఫోటోలో టేబుల్ మీద ఉన్న తినుబండారాలన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయి. దాని కింద 'న్యాయ విచారణ బందు - విందు భలే పసందు' అనే రైటప్ ఉంది.

టిఫిన్ తినడం తప్పని ఎవరూ అనరు. కానీ అప్పటి పరిస్థితిలో టిఫిన్ తిన్నందుకే తప్పుపడతారు. అసలేం జరిగిందంటే-

ఆ రోజు సత్యమూర్తి రామగిరి వెళ్లారు. రామగిరి పల్లెటూరు. అడవి మధ్యలో ఉంది. అడవి ప్రాంతం కావడం వల్ల అక్కడ తీవ్రవాదుల ప్రాబల్యం ఉంది. ఎన్ని ప్రభుత్వాలు మారినా ఎందరు నాయకులు వచ్చినా తీవ్రవాద సమస్యను నిర్మూలించలేకపోయారు. ఎస్.ఐ రసూల్, సత్యమూర్తిని డాక్‌బంగ్లాకు తీసుకువెళ్లాడు. ఆ బంగళా ఊరిచివర ఉంది. దాని దగ్గరే రెండు మూడు దాబాలున్నాయి. డాక్ బంగళాకు కుడివైపు రోడ్డు ఉంటే ఎడమవైపు రైలు మార్గం ఉంది. రామగిరిలో ఎటుచూసినా పచ్చదనమే కనిపిస్తుంది. డాక్ బంగళా ఆవరణలో జామ చెట్లూ, మామిడి చెట్లూ, నారింజ,సపోటాచెట్లూ,మల్లెతీగలూ, గులాబీ మొక్కలూ, మొగలి పువ్వులూ ఉన్నాయి. ఆ బంగళా సమీపంలో రెండిళ్లూ, ఒక చిన్న హోటలూ ఉన్నాయి. ఆ హోటల్ ముందు ఐదారు టేబుళ్లున్నాయి. వాటి చుట్టూ కుర్చీలున్నాయి. ఆ కుర్చీల్లో కూచుని కొందరు టిఫిన్ తింటున్నారు. సత్యమూర్తికి కూడా హోటల్‌కు వెళ్లాలనిపించింది. కానీ తన హోదా గుర్తుకు వచ్చి ఆగిపోయారు. న్యాయవిచారణ కవర్‌చేయడానికి వచ్చిన విలేకరులు ఆ హోటల్ ముందు కూచుని ఛాయ్ తాగుతున్నారు. నేనూ ఆ విలేకరులలో ఒకడనైతే బాగుండేది. అప్పుడు అందరిలా ఆ హోటల్‌కెళ్లి టిఫిన్ చేసి టీ తాగేవాడిని. హోదా కూడా ఒకప్పుడు సంకెలగా మారి ఒంటరిని చేస్తుందేమో! అని సత్యమూర్తి మనసులో అనుకొంటుండగా, ఓ కానిస్టేబుల్ ఫ్లాస్కులో టీ తెచ్చి ఆయనకు ఇచ్చాడు. ఆయన టీ తాగుతూ రోడ్డు మీద నుంచి వెళుతున్న బస్సుల్ని చూస్తూ కూర్చున్నారు.

“సార్ బోర్ కొడుతున్నదా!”

సత్యమూర్తి తలతిప్పి చూశారు. ఎదురుగా ఎస్.ఐ రసూల్ కనిపించాడు. అతను పొడుగ్గా ఉన్నాడు. నల్లగా తుమ్మమొద్దుకు సిగ్గొచ్చేలా ఉన్నాడు. ఒడ్డును కోసి భూమ్మీదకి రావడానికి ప్రయత్నిస్తున్న సముద్రంలా అతని పొట్ట బెల్టు నుంచి బయటపడడానికి శతవిధాల ప్రయత్నిస్తున్నది. అతడి కళ్లు ఉబ్బి ఉన్నాయి. బుర్ర మీసం దళసరి గడ్డంతో భీకరంగా ఉన్నాడు.

“అవును ఎంతసేపని ఒక్కడినీ ఇలా కూచోను” అన్నాడు సబ్ కలెక్టర్.

“నేను ముందే వచ్చేవాడ్ని కాని ఓ కేసు విచారణ మీద ఉండిపోవాల్సి వచ్చింది”.

“పన్నెండైనా ఒక్కడూ రాలేదు. ఇవాళ న్యాయ విచారణ అని ఈ ఊరి వాళ్లకు తెలీదు”.

“ఎందుకు తెలీదు సార్. నిన్న డప్పుతో ఈ రోజు పది గంటలకు డాక్‌బంగ్లాలో న్యాయ విచారణ అని చాటింపు వేయించాము. ఈ ఊరివాళ్ల తోలు మందమైనట్టుంది”

అంతలో విలేకర్లు, ఫోటోగ్రాఫర్లు అక్కడికొచ్చి కలెక్టర్‌కు నమస్కరించారు.

“ఎవరూ రానట్టుందే” అని ఒక విలేకరి అన్నాడు.

“ఎందుకొస్తారు. రండి అనగానే పోలోమంటూ లారీల్లో రావడానికి మేమేమైనా మంత్రులమా, రాజకీయ నాయకులమా? అప్పటికీ చాటింపు వేయించి మరీ 'రండి న్యాయమూర్తిగారు ఒస్తున్నారు' అని చెప్పాం. కానీ ఏ లాభం. ఒక్కడంటే ఒక్కడు రాలేదు. జగడాలు తీర్చేది మేము. రౌడీలకు, గూండాలకు బుద్ధి చెప్పేది మేము. ఆడవాళ్లపై అత్యాచారాలు జరక్కుండా చూసేది మేము. ముఖ్యమంత్రికీ, మంత్రులకూ ఎమ్మెల్యేలకు అంగరక్షకులము మేము. వారు పర్యటనకు వెళితే నిద్రాహారాలు మాని భద్రతా ఏర్పాట్లు చేసేది మేము. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేది మేము. నక్సలైట్లతో పోరాటం చేస్తూ ప్రాణాలు పోగొట్టుకునేది మేము. పెళ్లాం, పిల్లల్ని వదిలి, తీవ్రవాదుల కోసం అడవుల్ని గాలించేది మేము. మందుపాతరలకు బలయ్యేది మేము. అనుదినమూ శిలువనెక్కుతున్న క్రీస్తులము మేము. ఇన్ని చేసినా మా పోలీసులకు దక్కేవి తిట్లు శాపనార్థాలూ, పై అధికారుల వేధింపులు, ప్రజల సాధింపులు. అందరూ మమ్మల్ని అసహ్యించుకునే వారే. మా ఆత్మరక్షణ కోసం నక్సలైట్లను చంపితే నరరూప రాక్షసులంటూ మమ్మల్ని తిట్టేవారే. నక్సలైట్ల కాల్పుల్లో మరణించిన పోలీసుల గూర్చి ఒక్కడంటే ఒక్కడు కంట తడిపెడుతున్నాడా, లేదే. నక్సలైట్లు కాల్పుల్లో మరణిస్తే గొంతు చించుకుంటూ పత్రికలకూ, వీధులకూ ఎక్కే పౌర హక్కుల సంఘ నాయకులు నక్సల్స్ మందుపాతరకు పోలీసులు బలైతే నోరు మూసుకుంటారు. కవులూ, రచయితలూ కూడా తీవ్రవాదులను స్తుతిస్తూ రచనలు చేస్తారు.. కానీ పోలీసుల త్యాగాల గూర్చి ఒక్కడంటే ఒక్కడు ఎక్కడా ప్రస్తావించడు. తమ ప్రయోజనాలకు మమ్మల్ని వాడుకునే రాజకీయ నాయకులు మా సంక్షేమం గూర్చి పట్టించుకోరు. యుద్ధంలో ఎంతోమందిని కాల్చి చంపిన సైనికుడిని వీరుడని కీర్తిస్తారు. ఆపరేషన్ ఫేలవడంతో రోగి చచ్చినా వైద్యుడిని ఏమీ అనరు. యాక్సిడెంట్లు చేసి ఎందరి మరణాలకు కారకుడైన బస్సు డ్రైవర్‌నూ తిట్టరు. కానీ మేము జరిపిన కాల్పుల్లో ఎవరైనా మరణిస్తే చాలు- ధర్నాలు, ఉద్యమాలు, పత్రికలో పతాక శీర్షికలలో వార్తలు. ఒక్కసారి అనిపిస్తుంది. పోలీసు ఉద్యోగం చేయడంకంటే పల్లీలు అమ్ముకొని బతకడం

> పోలీసుల త్యాగాల గూర్చి ఒక్కడంటే ఒక్కడు ఎక్కడా ప్రస్తావించడు. తమ ప్రయోజనాలకు మమ్మల్ని వాడుకునే రాజకీయ నాయకులు మా సంక్షేమం గూర్చి పట్టించుకోరు

మేలని..." అని ఏకబిగిన మాట్లాడటంతో ఆయాసం వచ్చి ఎస్.ఐ రసూల్ ఆగాడు.

"మేము మీ గురించి కూడా రాస్తున్నం గదా సార్" అని ఒక విలేకరి అన్నాడు.

"ఆ రాస్తున్నారు. అమాస వున్నాంకు"

"ఇప్పుడే వాదనెందుకు గాని ఇవాళ్టి విచారణను వచ్చే నెల పదో తారీక్కు వాయిదా వేస్తున్నాను. అప్పుడైనా ఊరిజనం హాజరై సాక్ష్యం చెప్పేటట్లు చూడండి" అంటూ సత్యమూర్తి కుర్చీలోంచి లేచారు.

"సార్ ఏదో ఉండబట్టలేక నా మనసులోని బాధను వెళ్లగక్కాను. మీ అందరికి భోజనాల ఏర్పాట్లు చేసాను" అని రసూల్ అన్నాడు.

"నీ బాధను నేను అర్థం చేసుకున్నానయ్యా. అది సరేగాని నువ్వొచ్చి ఎంతోసేపు కాలేదు. భోజనాల ఏర్పాటు ఎప్పుడు చేసావయ్యా."

"పొద్దుటే మా కానిస్టేబుల్‌ని భోజనం ఏర్పాట్లు చెయ్యమని చెప్పి కేసు కోసం పోయాను సార్" అని రసూల్ అన్నాడు.

ఎస్సై ఆదేశాలననుసరించి వారు ప్రజల మీద తమ లాఠీల ప్రతాపాన్ని చూపించారు. జెనం చెల్లాచెదరై తలో దిక్కు పారిపోసాగారు.

డాక్ బంగ్లాకు వెనక ఉన్న డైనింగ్ హాల్లో భోజనాలకు ఏర్పాట్లు జరిగాయి. గులాబ్‌జాం, జహంగీర్, చికెన్ బిర్యాని, అన్నం, బెండకాయవేపుడు, పప్పు, పెరుగు, ఐస్‌క్రీం ఉన్నాయి. అన్నిటిని చూడగానే ఆకలితో ఉన్న విలేకరులూ వాటిపై పడ్డారు. మర్యాద కోసం వాళ్లు ముందుగా కలెక్టర్ ప్లేట్లో గులాబ్‌జాం, జహంగీర్ వేస్తుండగా ఆయనకు తెలీకుండా ఓ ఫోటోగ్రాఫర్ ఫోటో తీసాడు. మర్నాడు జిల్లా ఎడిషన్ ఫ్రంట్ పేజీలో ఆ ఫోటో వచ్చింది. ఆ ఫోటో రైటప్ 'విచారణ బందు- విందు బలే పసందు' అని ఉండటంతో పొద్దున్నే ఆ ఫోటో చూసిన సత్యమూర్తికి తలకొట్టేసినంత పనయ్యింది.

**2**

యమలోకం గోలగోలగా ఉంది. పెద్ద దున్నపోతు మీద యమధర్మరాజు కూచుని ఉన్నాడు. దున్నపోతు ముందు సురలోక ఉద్యానవనం నుంచి దిగుమతి చేసుకొన్న శ్రేష్ఠమైన పచ్చగడ్డి ఉంది. పచ్చగడ్డిని నెమరేస్తూ అర్థనిమీలిత నేత్రాలతో ఆనందపారవశ్యంలో ఎటూ కదలకుండా శిలా విగ్రహంలా దున్నపోతు నిలబడి ఉంది. యమునికి కుడి పక్కన పెద్ద చార్ట్‌ను సునిశితంగా పరిశీలిస్తున్న చిత్రగుప్తుడు సుఖాసీనుడై ఉన్నాడు. యముడి కుడి చేతిలో గదా, ఎడమ చేతిలో పాశమూ ఉన్నాయి.

ఇద్దరు శూలధారులైన యమకింకరులు ఒక పాపాత్ముడిని వెంట బెట్టుకొని యముడి ముందు హాజరయ్యారు? వాడిని చూసి -

"చిత్రగుప్తా ఈ పాపి చేసిన నేరములేమిటి?" అని యముడు ప్రశ్నించాడు.

చిత్రగుప్తుడు ఓసారి చిట్టా తిరగేసి-

"వీడు ఎన్నో చెడు తిరుగుళ్లు తిరిగాడు. ఎయిడ్స్ వ్యాధి కొనితెచ్చుకున్నాడు. తనకు ఎయిడ్స్ ఉందని తెలిసి కూడా ఆ వ్యాధిని తన భార్య కంటించాడు. నిర్దాక్షిణ్యంగా ఆమెను మృత్యువు కోరల్లోకి తోసేసాడు" అని కంప్యూటర్ కంటే స్పీడుగా చిత్రగుప్తుడు చెప్పాడు.

"వీడిని సలసలకాగే నూనెలో పడేయండి" అని యముడు ఆజ్ఞాపించాడు.

యముడి ఆదేశాన్ని అమలు చేయడానికిగాను ఆ పాపిని యమకింకరులు తీసుకుపోయారు.

వారిలా వెళ్లగానే అలా మరో పాపిని వెంటబెట్టుకొని మరో ఇద్దరు యమకింకరులు యముని సమక్షంలోకి వచ్చారు.

"వీడేం చేసాడు" అని యథాప్రకారంగా యముడు అడిగాడు.

"వీడు మతపిచ్చిని ప్రేరేపించి వేలాది మంది మరణానికి కారకుడయ్యాడు" అని చిత్రగుప్తుడు చెప్పాడు.

"అలాగా వీడికి కత్తితో గాట్లు పెట్టి కారం జల్లండి. తేళ్లను వాడి మీదకు వదలండి" అని యముడు కింకరులను ఆజ్ఞాపించాడు.

ఆయన ఆజ్ఞను తూ.చ తప్పకుండా పాలించడానికిగాను ఆ పాపిని కింకరులు వెంటబెట్టుకొని పోయారు.

యముని కొలువు కూటానికి చాలా దూరంలో శిక్షల శాల ఉంది. అది చీకటి గుయ్యారంలా ఉంటుంది. కాగడాల వెలుతుర్లో యమకింకరులు శిక్షలను అమలు చేస్తుంటారు. శిక్షలు అమలవుతున్నప్పుడు పాపుల చేసే ఆక్రందనలూ, హాహాకారాలు ఆకాశమంతా ప్రతిధ్వనిస్తుంటాయి. సౌండ్ ప్రూఫ్ కారణంగా అవి స్వర్గానికి చేరుకోలేకపోతున్నాయి. కానీ ఆకాశ మార్గాన వెళుతున్న నారదుని చెవిన పడ్డాయి. ఆయన భూలోకంలో ప్రత్యేకించి ఆంధ్ర రాష్ట్రంలో అదృశ్య రూపంలో పర్యటించి వస్తున్నాడు. ముందుగా నరకానికే వెళ్ళాలని భూలోకంలోనే ఆయన నిర్ణయించుకున్నాడు.

"ప్రణామం యమధర్మరాజా" అంటూ నారదుడు చేతులు జోడించాడు. కింకరులు పాపులను ప్రవేశపెట్టకపోవడంతో తీరిగ్గా ఉన్న యముడు -

"నారదా! ఎక్కడ నుంచి వస్తున్నావు. విశేషాలేమిటి" అని ప్రశ్నించాడు.

"భూలోకంలోని ఆంధ్ర రాష్ట్రం నుండి మీకు సంబంధించిన విశేషాలే ఉండటం వల్ల ఎక్కడికీ పోక సరాసరి మీ వద్దకే వచ్చాను దేవా" అని నారదుడన్నాడు.



"మాకు సంబంధించిన విశేషాలు భూలోకంలో ఎక్కడుంటాయి నారదా? కొంపదీసి మా కింకరులు ఒకడి ప్రాణాల బదులు మరొకడి ప్రాణాలు తియ్యలేదు గద" అని యముడు అడిగాడు.

"అదేం లేదు. నేను చెప్పడం కంటే మీరొకరి గత కాల దర్శినిని చూస్తే బాగుంటుంది" అని నారదుడు సలహా చెప్పాడు.

గత దర్శినిలో గతంలో జరిగిన సంఘటనలన్నీ యథాతథంగా కనిపిస్తాయి. అది చిత్రగుప్తుని వద్ద ఉంది. తన చిట్టా విషయంలో ఏమైనా సందేహాలు తలెత్తితే గతదర్శిని చూసి తీర్చుకుంటాడు. నారదుడు ; యమునికిచ్చిన సలహాను వినగానే గత దర్శినిని చిత్రగుప్తుడు కొద్దిసేపు కళ్లు మూసుకొని తెరిచాడు. ఆయన కళ్లు తెరవగానే గతదర్శినిలో కనిపించిన సంఘటనల క్రమం ఇలా ఉంది.

అది నేషనల్ హైవే. వాహనాల రొదలతో నిశ్శబ్దాన్ని తరిమి కొట్టే ఆ రోడ్డులో ఆ రోజు ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఏ పదడుగులో యాభై అడుగులో కాదు; నాలుగైదు మైళ్ల వరకు ఏ మాంత్రికుడో మంత్రదండంతో శిలావిగ్రహాలుగా మార్చిన సెడిపేల్లాగా ఉండిపోయాయి. ఆ రోడ్డుపై పెద్ద ప్రమాదం జరగలేదు. ఏ భూకంపం మూలంగానో ఆ రోడ్డు కుంగిపోలేదు. వరదల కారణంగా ఆ రోడ్డు నీట మునిగిపోలేదు. మొరగదం కూడా చేతగాని పల్లె కూలీల మూలంగా ఆ రోడ్డుపై వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఓ మైలు పొడుగ్గా ఆ ఊరిజనం బైఠాయించి రాస్తారోకో చేస్తున్నారు. వారికి మద్దతిస్తున్న కార్మిక సంఘాలు; రైతు కూలీ సంఘాలు కూడా రాస్తారోకోలో పాల్గొన్నాయి. ఆ సంఘాల కార్యకర్తల చేతుల్లో ఎర్రజండాలున్నాయి.

"బూటకపు ఎన్‌కౌంటర్" అని ఓ ఎర్రజెండా అరవగానే -

"నశించాలి" అని అందరూ అరిచారు.

"పూసల చిన మాణిక్యం ఎన్‌కౌంటర్‌పై" అని ఒక కార్మిక నాయకుడు నినదించగా-

"న్యాయ విచారణ జరపాలి" అనే అరుపులకు చుట్టుపక్కలున్న అదవంతా దద్దరిల్లిపోయింది.

"జీనాహైతో, మర్నాసీకో" అంటూ ఒక విద్యార్థి పిడికిలి బిగించగానే -

"కదం కదం పర్ లడ్నా సీకో" అంటూ ఆకాశపుటంచుల్ని తాకేలా అందరూ అరిచారు.

పదే పదే అదే పనిగా అరవడం వల్ల అందరి గొంతులూ ఎండిపోయాయి. కొందరి గొంతులు బొంగురుపోయాయి. దాంతో అందరూ నీళ్ళకోసం వ్యవసాయ బావివైపు పోవడానికి సిద్ధపడ్డారు. కాని నాయకులు నీళ్లు తాగేందుకు బ్యాచీల వారిగా జనాన్ని పంపారు. మొదట బ్యాచ్ వారు వచ్చేక రెండో బ్యాచిని, రెండో బ్యాచి వచ్చాక మూడో బ్యాచ్‌ని పంపి రోడ్డు ఖాళీ కాకుండా జాగ్రత్త పడ్డారు. ఎప్పుడు సందు దొరుకుతుందా అని లారీ డ్రైవర్లు బీడీలు కాలుస్తూ ఎదురు చూస్తున్నారు.

రాస్తారోకో మూలంగా జాతీయ రహదారి మీద రాకపోకలు ఆగిపోయినట్లు పోలీసులకు సమాచారం అందింది. జీపు వెళ్లడానికి కూడా సందులేకపోవడంతో పోలీసు బలగాలు కాలినడకనే బయల్దేరాల్సి వచ్చింది. రెండు గంటలు ఏకబిగిన నడిచాక రాస్తారోకో చేస్తున్న ప్రదేశానికి పోలీసులు చేరుకొన్నారు.

"రాస్తారోకో ఆపి రోడ్డుమీద నుంచి లేవండి" అంటూ ఎస్సై ఆదేశించాడు.


ఎస్సై ఆదేశాన్ని ఏమాత్రం ఖాతరుచేయకుండా "పూసల చిన మాణిక్యం ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరపాలి" అంటూ ప్రజలు నినాదాలిచ్చారు.

" మీరు లేచి వెళ్లకపోతే లాఠీఛార్జీ చేస్తాం" అని ఎస్సై హెచ్చరించాడు.

"లాఠీ గోలీ కాయేంగే. ఇన్సాఫ్ లేకే జాయేంగే" అంటూ ప్రజలు నినదించారు.

ఎస్సై బెదిరించినా, బతిమాలినా, ప్రలోభాలు పెట్టినా ఎవరూ లొంగలేదు. రాస్తారోకోను విరమించ

లేదు. దాంతో ఎస్సైకి సహనం నశించింది. లాఠీఛార్జికి ఆయన ఆదేశాలిచ్చాడు. ఎన్నడూ లేనిది ఎండలో కాలినడకన రావడంతో పోలీసులు మండిపోతున్నారు. తమ కోపం ఎవరి మీద చూపుదామాని ఎదురు చూస్తున్నారు. ఎస్సై ఆదేశాలననుసరించి వారు ప్రజల మీద తమ లాఠీల ప్రతాపాన్ని చూపించారు. జెనం చెల్లా చెదరై తలో దిక్కు పారిపోసాగారు. ఎటుపోవాలో తెలియని అయోమయంలో పడ్డ మహిళలూ పిల్లలూ ఏడ్పు మొదలుపెట్టారు. సందట్లో సడేమియా అన్నట్టు ఎవరో ఒక పోలీసు తుపాకీ లాక్కుని దగ్గరలో ఉన్న అడవిలోకి పారిపోయారు. దాంతో పోలీసులు మండిపడుతూ చిన్నా పెద్దా, ముసలీ ముతకా అనే విచక్షణా జ్ఞానం లేకుండా అందినవాళ్లను అందినట్లు బాదసాగారు.



మర్నాడు తుపాకీని ఎత్తుకుపోయిన వారి మీద పోలీసులు కేసుపెట్టారు. నిజానికి తుపాకీని ఎవరు ఎత్తుకుపోయారో పోలీసులకు ఎంతమాత్రమూ తెలియదు. ఓటర్ల జాబితాలోని కొన్ని పేర్లతో పోలీసులు ఒక జాబితా రూపొందించారు. జాబితాలో పేర్లు ఉన్నవారంతా తుపాకీ ఎత్తుకుపోయినట్లు ఆరోపించారు. వారిమీద కేసు పెట్టారు. పోలీసులే కేసు పెట్టిన వారిలో ఒకరు రెండేళ్ల ముంగటనే సచ్చిండు. ఇంకొకడు ఐదేండ్ల ముంగటనే దుబాయ్ బోయిండు. ఒకడైతె ఐదేండ్ల పోరగాడు. ఇంకొడైతె పిచ్చోడు.

ఏంతెలియని అమాయకులను పట్టుకొని పోలీసులు చావబాదడం గత దర్శినిలో వివరంగా కనిపించింది.

"ఈ ఆంధ్రప్రదేశ్ పోలీసులను చూస్తే మా కింకరులే వెయ్యిరెట్లు నయమనిపిస్తున్నది" అని యముడు అన్నాడు.

"మీ నరకలోకంలో ఉన్న వాడి మీద కూడా పోలీసులు కేసుపెట్టారు" అని నారదుడు అన్నాడు.

"భూలోకంలో ధర్మం నశించింది. ఆంధ్రప్రదేశ్ పోలీసులు పొరపాటు చేస్తే నువ్వొచ్చి మమ్మల్ని గాబారాపెట్టావు నారదా!" అని యముడన్నాడు.

"ఇంతకూ జెనం రాస్తారోకో ఎందుకు చేశారు" అని చిత్రగుప్తుడు అడిగాడు.

"ఎన్‌కౌంటర్లో పూసల మాణిక్యం అనే నక్సలైట్ మరణించాడని పోలీసులు ప్రకటించారు. ఎన్‌కౌంటర్లో మరణించిన వాడు పూసల చిన మాణిక్యం. అతను కుమ్మరివాడు. మాణిక్యం హత్యపై న్యాయవిచారణ జరిపించాలని ప్రజలు డిమాండ్ చేశారు" అని నారదుడు చెప్పాడు.

## 3

ఆరోజు రెండోసారి మాణిక్యం ఎన్‌కౌంటర్‌పై న్యాయవిచారణ జరగాల్సి ఉంది. ఒక వైపు దీమాగా ఉన్నా మరో వైపు ఎస్సై రసూల్ ఏమవుతుందోనని దిగులు పడసాగాడు. పూసల మాణిక్యం నక్సలైట్ కాదనీ, కుమ్మరివాడనీ, పొరపాటున అతడిని పోలీసులు కాల్చివేసారనీ అతనికి తెలుసు. కానీ ఉన్నదున్నట్టు చెబితే తన ఉద్యోగం ఊడటం ఖాయం. ఎలాగైనా మసిపూసి మారేడు కాయ చేసి ఈ కేసు నుంచి బయటపడటానికి గట్టిగా ప్రయత్నించాలని అతను అనుకొన్నాడు. పూసల మాణిక్యమనే పేరుతో ఒక నక్సలైట్ ఉండటంతో తన పని సులువవుతుందని అతను భావించాడు. ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించాడు.

రెండోసారి న్యాయవిచారణకు మాజీ న్యాయమూర్తి ఇందల్వాయికి వచ్చారు. ఎప్పటిలాగే డాక్‌బంగ్లాలో ఆయన దిగారు. ఈసారి ఫలహారాల దగ్గరనుంచి మంచి నీళ్లవరకూ ఆయన ఇంటి దగ్గర నుంచే తెచ్చుకొన్నారు.

మధ్యాహ్నం పన్నెండయ్యింది. ఎండ మండిపోతున్నది. గ్రామప్రజల్లో సాక్ష్యం చెప్పడానికి ఒక్కడు కూడా రాలేదు. మాజీ న్యాయమూర్తి అసహనంతో అటూఇటూ తిరగసాగారు. ఆయన అటూఇటూ తిరుగుతున్నప్పుడే ఎస్సై రసూల్ వచ్చాడు.

"భోంచేస్తారా సార్" అని న్యాయమూర్తిని అడిగాడు.

"నా భోజనం గూర్చి ఏర్పాట్లు చేయకండి" అని న్యాయమూర్తి అన్నారు.

"అదేం సార్ అలా అంటారు"

"ఇంటినుంచే అన్నీ తెచ్చుకొన్నాను. పత్రికా విలేకరులకు భోజనాలు పెట్టించండి"

"మంచిది సార్" అంటూ రసూల్ భోజనాల ఏర్పాట్లు చేయించడానికి వెళ్లాడు. భోజనాలయ్యాక పోలీసులను విచారిస్తే బాగుంటుందని సత్యమూర్తి అనుకొన్నారు.

"ఇంతకూ మాణిక్యం నక్సలైటేనా"అని సత్యమూర్తి ఎస్సై రసూల్‌ను అడిగారు.

"నిస్సందేహంగా నక్సలైటే"

"అంత కచ్చితంగా మీరెలా చెప్పగలరు"

"రెండేళ్ల క్రితం రైల్వే స్టేషన్ పేల్చివేతలో మాణిక్యం నిందితుడు. రైలు స్టేషన్ పేల్చిన నక్సలైట్ల దళంలో మాణిక్యం కూడా ఉన్నట్లు వార్త కూడా వచ్చింది. అంతేకాక మందుపాతర పేల్చి నారాయణ్ పూర్ ఎమ్మెల్యేను చంపిన కేసులో కూడా మాణిక్యం నిందితుడు. టెలిఫోన్ ఎక్స్ఛేంజ్, బ్యాంకులను పేల్చివేసిన నక్సలైట్లలో మాణిక్యం కూడా ఉన్నాడు. అతని తల మీద యాభైవేల రూపాయలున్నాయి. పొద్దుటి పూట కుండలు చేస్తూ రాత్రిపూట నక్సల్స్ కార్యకలాపాల్లో మాణిక్యం పాలుపంచుకొనే వాడు. పక్క ఊరిలోని పోచయ్య అనే నక్సలైట్ సానుభూతిపరునితో కలిసి గ్రామీణులకు నక్సల్స్ సిద్ధాంతాల్ని మాణిక్యం బోధించే వాడు. మాణిక్యం ఇలటిని సోదాచేసినపుడు తీవ్రవాద సాహిత్యంతో పాటు ఒక నాటు తుపాకీ, నాటుబాంబులు దొరికాయి. పోచయ్యను అరెస్ట్ చేసి విచారిస్తే మాణిక్యం మండల నక్సల్ దళనాయకుడనే విషయం వెల్లడైంది. రాయలసీమ నుంచి తెప్పించుకొన్న నాటు బాంబుల్ని ఎవరికీ అనుమానం రాకుండా కుండల్లో పెట్టి మాణిక్యం నక్సలైట్లకు సరఫరాచేసినట్లు రుజువుచేసే సాక్ష్యాధారాలు మా వద్ద ఉన్నాయి" అని ఎస్సైరసూల్ చెప్పాడు.

> **మాణిక్యమనే నక్సలైటు వేరేవాడనుకొన్నాము. ఈ మాణిక్యమే నక్సల్స్ మాణిక్యమని ఎన్‌కౌంటర్ జరిపేదాకా మాకు తెలియదు" అని ఎస్సై తెలిపాడు**

"మాణిక్యంను ఎందుకు ఎన్‌కౌంటర్ చేశారు?" అని సత్యమూర్తి అడిగారు.

"మా ఆత్మరక్షణ కోసం చేసిన కాల్పులల్ల మాణిక్యం చచ్చాడు"

"మాణిక్యం పోలీసులపై కాల్పులు జరిపాడా?"

"అవును జరిపాడు. పోలీసుల్లో ఒకరికి గాయాలు కూడా తగిలాయి"

"మాణిక్యం నక్సలైట్‌ని మీరెలా గుర్తించారు"

"మూడురోజుల క్రితం ఈ ప్రాంతంలో నక్సలైట్ దళం మందుపాతరలు అమర్చబోతున్నట్లు ఇన్‌ఫార్మర్ల నుంచి మాకు సమాచారం అందింది. నక్సల్స్ కోసం మేము గాలింపు చర్యల్ని ప్రారంభించాం. తెల్లవారు జామున చెట్టుచాటున ఏదో ఆకారం కదులుతున్నట్లు మాకు అనిపించింది. అనుమానించి ఎవరని అడిగాం. బదులుగా బుల్లెట్లు వచ్చాయి. చెట్టు చాటునున్నది నక్సలైట్లే అని నిర్ధారించుకొన్న తరువాత మేము ఎదురుకాల్పులుజరిపాము. చెట్టుచాటునున్న నక్సలైట్‌కు ఛాతీలో రెండు బుల్లెట్లూ, పారిపోవడానికి యత్నించినప్పుడు మేము జరిపిన కాల్పుల్లో వీపులో ఒక బుల్లెట్టూ దిగాయి. కాల్పులు ఆగాక వెళ్లిచూస్తే ఆలివ్ గ్రీన్ దుస్తుల్లో ఉన్న మాణిక్యం మాక్కనిపించాడు"

"రోజూ మాణిక్యం మీ కళ్లముందే తిరుగుతూ ఉంటే మీకనుమానం రాలేదా?"

"రాలేదు. మాణిక్యమనే నక్సలైటు వేరేవాడనుకొన్నాము. ఈ మాణిక్యమే నక్సల్స్ మాణిక్యమని ఎన్‌కౌంటర్ జరిపేదాకా మాకు తెలియదు" అని ఎస్సై తెలిపాడు.

"మరి మాణిక్యం నక్సలైట్ కాదని ఊరివారంతా అంటున్నారు కదా"

"పోలీసుల మీద కోపంతో వారు అలా చెబుతున్నారు"

"రాస్తారోకో చేసి వాహనాల రాకపోకల్ని స్తంభింపజేశారు కదా"

"రైతుకూలీ సంఘం నాయకులు వారిని రెచ్చగొట్టిన ఫలితమే అది"

"పోలీసులు విచక్షణా రహితంగా లాఠీచార్జి చేశారని అంటున్నారు"

"గ్రామ ప్రజలే మా పోలీసు తుపాకీ లాక్కుపోయారు. ప్రజల్లో కలిసిన నక్సలైట్ల పనే ఇది అని విశ్వసిస్తున్నాము. అనుమానితుల మీద కేసు కూడా పెట్టాము. మాణిక్యం నక్సలైట్ అయిన కారణంగానే నక్సల్స్ ప్రజల్లో కలిసి ఆందోళన చేస్తున్నారు" అని రసూల్ అన్నాడు.

"ఇంతకు ఈ రోజు కూడా జెనం రానట్టేనా"

"సాక్ష్యం చెప్పడానికి ఒక్కడూ రాలేదు. మరో రోజు విచారణ జరపక తప్పదు" అని ఎస్సై అన్నాడు.

## 4

"మా తమ్ముడు నక్సలైటు గాదు. దినాం కుండలు జేసెటోడు. జేసిన కుండలను పక్క ఊరికి బోయి అమ్ముకోని ఒచ్చెటోడు" మాణిక్యం అన్న పెద్దమాణిక్యం న్యాయవిచారణ జురుపుతున్న న్యాయమూర్తి ముందు చెప్పాడు.

"మీ తమ్ముడు రోజూ రాత్రి మీ ఇంట్లోనే పడుకునేవాడా?" అని న్యాయమూర్తి ప్రశ్నించారు.

" దినాం రాత్రి గాదు ఆని దోస్తు ఇస్తారి ఇంట్ల బండెటోడు. గాల్లిద్దరు పదో తరగతి దాంక కలిసి సద్వుకున్నరు"

"ఇస్తారికి నక్సలైట్లతో సంబంధముందని రుజువైంది. అతని ఇంట్లో తీవ్రవాద సాహిత్యంతో పాటు నాటు బాంబులు, నాటు తుపాకి దొరికింది."

"గదంత నాకెర్కలేధు."

"మీ తమ్ముడు ఎప్పుడూ విప్లవ గీతాల్ని పాడేవాడట గదా"

"గవేంటియో నాకెర్కలేదు. గని మా తమ్ముడు గద్దర్ పాటలు బాడంగ ఇన్న"

"ఎన్‌కౌంటర్ జరిగిన రోజున మీ తమ్ముడు ఎక్కడికెళ్లాడు"

"పొద్దుగాల్లనే లేసి చెంబట్కబోయొస్త అని జెప్పిండు. బోయినోడు మల్ల ఇంటికి రాలేదు. పోలీసోల్లు గాన్ని సంపింద్రని అటెంకల ఎర్కఅయ్యింది"

"ఆరోజు పొద్దున్న నువ్వు గాక మాణిక్యాన్ని ఇంకెవరన్నా చూసారా?"

"పక్కింటి పోచమ్మ జూసింది"

"పోచమ్మ వచ్చిందా" అని న్యాయమూర్తి ప్రశ్నించారు.

"వచ్చింది సార్" అని ఎస్సై రసూల్ చెప్పాడు.

పోచమ్మ న్యాయమూర్తి ముందుకు వచ్చి నిలబడింది. ఆమె మధ్యవయస్కురాలు. కూలీనాలీ చేసుకొని బతుకుతూ ఉంది. సాక్ష్యం చెప్పాలనగానే మొదట ఆమె భయపడింది. నలుగురూ ఏం కాదని ధైర్యం చెప్పాక సాక్ష్యం చెప్పడానికి వచ్చింది.

**మాణిక్యం కుండలు చేసుకొని బతికే సామాన్య పౌరుడేనని అంతరాత్మ ఘోషిస్తున్నా న్యాయమూర్తి నిస్సహాయంగా ఉండిపోయారు.**

"మాణిక్యంను నువ్వు ఎప్పుడు చూసావు?" అని న్యాయమూర్తి ఆమెను ప్రశ్నించారు.

"సంక్రాంతి పండ్గకు ఒక దినం ముందు పొద్దుగాల్ల నేను ఆకిలి ఊకి సాన్పు జల్లుతున్న. గప్పుడు మాణిక్యం చెంబుబట్టుకోని చెల్క దిక్కు బోంగ జూసిన"

"ఇంకెవరైనా ఆ రోజు మాణిక్యాన్ని చూసారా?" అని న్యాయమూర్తి అడిగారు.

"నా పేరు సత్నారి. నాకు ఒక చిన్న హోటల్ ఉన్నది. గా దినం పొద్దుగాల్ల హోటల్ దెరిసి గూసున్న. గప్పుడు చెంబట్కోని బోతున్న మాణిక్యం గండ్లబడ్డడు." అని సత్నారి చెప్పాడు.

"మాణిక్యం మీ ఊర్లో ఎవరితోనైనా పోట్లాడేవాడా"

"అందరితోని కొట్లాడెటోడు. రెండు పార్లు గాన్ని పోలీసులు గూడ బట్కబోయింద్రు"

"నక్సలైట్లతో మాణిక్యానికి సంబంధముండేదా?"

"గా సంగతి నాకెర్కలేదు గని ఉన్నోల్ల కిలాఫ్ గాడు మాట్లాడెటోడు. గద్దర్ పాటలు బాడెటోడు. దొరోల్లమీద మర్లబడాలని మాకందర్కి జెప్పెటోడు" అని సత్నారి అన్నాడు.

"మాణిక్యాన్ని మీ ఊర్లో అందరూ ఏమని పిలిచేవారు"

"చిన మాణిక్యం అని పిలుస్తుంటిమి. గాని అన్నను పెద మాణిక్యం అని పిల్సెటోల్లం"

మాణిక్యం నక్సలైటు కాడనే సాక్ష్యాధారాల్ని ఎవరూ చూపలేకపోయారు. మాణిక్యం కుండలు చేసుకొని బతికే సామాన్యపౌరుడేనని అంతరాత్మ ఘోషిస్తున్నా న్యాయమూర్తి నిస్సహాయంగా ఉండిపోయారు. పోలీసులు చూపిన సాక్ష్యాధారాల్ని నమ్మాల్సిన పరిస్థితి ఏర్పడినందుకు విచారించారు. ప్రభుత్వానికీ, పోలీసులకూ అనుకూలంగా నివేదిక తయారుచేయాల్సి వచ్చినందుకు తనని తానే నిందించుకొన్నారు.

**5**

పొగమంచు ఇంకా వీడలేదు. చలికి సూర్యుడు కూడా ముడంకె వేసి పడుకున్నట్టున్నాడు.

ఎవరు లేవకున్నా కోడి కూస్తునే ఉంది.

గుడి నుంచి భక్తిసంగీతం వినిపిస్తూనే ఉంది. కొందరాడవాళ్లు వాకిలి ఊడ్చి సాన్పుజల్లి ముగ్గులేస్తున్నారు. చేదబావి గిలక చప్పుడు వినిపిస్తూనే ఉంది. తెల్లారగట్లే లేచిన పూజారి ఎందుకయ్యా ఉంచినావూ బందిఖానలో అని పాడుతున్నాడు. ఇంట్లోని వారంతా అతని పాటకు విసుక్కుంటున్నారు.

న్యాయమూర్తి తెల్లవారి నాలుగ్గంటలకే లేచారు. నివేదిక తయారుచేయడానికి కూర్చున్నారు. కానీ ఎంత ప్రయత్నించినా ఆయన పని సాగలేదు. తలనొప్పిగా ఉన్నదనిపిస్తే ఆయన ఛాయ్ తాగారు. సరిగ్గా అప్పుడే ఆ రోజు పేపర్ వచ్చింది. ఆయన పేపర్ చూడసాగారు. మొదటి పేజీలోనే నక్సలైట్ పూసల మాణిక్యం కామెర్ల వ్యాధితో మృతి అని ఫోటోతో ఉన్న వార్తను ఆయన చూసారు.

ఐదేళ్లుగా ఐలన్న దళంలో పనిచేసిన కామ్రేడ్ పూసల మాణిక్యం రాత్రి కామెర్ల వ్యాధితో మరణించాడు. బతికినంత కాలం పీడిత జన విముక్తి కోసం పోరాడిన మాణిక్యంకు లాల్ సలామ్. ఆయన ఆశయ సాధన కోసం మేమంతా పనిచేస్తాము-

***దళ కమాండర్: అజిత్***

పేపర్‌లో వచ్చిన వార్త చూడగానే న్యాయమూర్తికి ప్రవాహంలో కొట్టుకుపోతున్న వాడికి ఆధారం దొరికినట్లు అయ్యింది. పోలీసుల ఎన్‌కౌంటర్‌లో మరణించింది కుమ్మరి మాణిక్యమని నిరూపించడానికి ఆధారం దొరికిందని ఆయన మురిసిపోయారు. కానీ రెండో పేజీ చూడగానే ఆయనకు నిరుత్సాహం ఆవరించింది. కామెర్లతో మరణిచిన వాడు మాణిక్యం కాదు. మల్లన్న. మల్లన్నే మాణిక్యంగా నిరూపించడానికి నక్సల్స్ పన్నిన పన్నాగమిది. ఎన్‌కౌంటర్‌లో మాణిక్యం మరణించాడు. దానిపై న్యాయవిచారణ కూడా జరిగింది. నివేదిక వచ్చే తరుణంలో విచారణ అధికారిని తప్పుదోవ పట్టించడానికి నక్సల్స్ పన్నిన కుట్ర ఇది.



కామెర్లతో మరణించిన వాడు తమ కొడుకేనని వంగపల్లిలోని అతని తల్లిదండ్రులు తెలిపారు. అదే విషయాన్ని వంగపల్లి గ్రామస్తులు కూడా నిర్ధారించారు అంటూ ఎస్సై ఇచ్చిన ప్రకటన అది.

ఆ ప్రకటన చదవగానే న్యాయమూర్తికి తన చేతులను ఏదో అదృశ్యశక్తి కట్టేసినట్లు భావన కలిగింది. న్యాయదేవత కన్నీరుమున్నీరుగా విలపించినట్లు అయ్యింది. ●

## సూర్య రథానికి కవితార్చన!

ఒడిస్సాలోని కోణార్క్ సూర్య దేవాలయం విలక్షణమైన శిల్పకళా నైపుణ్యానికి కాణాచి. దాదాపు 700 సంవత్సరాల పాటు మట్టిలో కూరుకుపోయి 1901లో బ్రిటీష్ పురాతత్వవేత్త అన్వేషణలో బయల్పడి, గత వందేళ్ళుగా పర్యాటకుల్ని ఆకట్టుకుంటున్నది. ఆ కోణార్క్ సూర్యమందిరంలో పూజా పునస్కారాలు ఏవి జరగవు. సూర్య రథంగా తీర్చిదిద్దబడిన 'కోణార్క్'ను సంరక్షించి నూరేళ్ళు నిండిన సందర్భంలో ఇటీవల అక్కడే అఖిల భారత కవి సమ్మేళనం జరిగింది. ఒడిస్సా సాహిత్యఅకాడెమీ, కేంద్రసాహిత్య అకాడెమీ, పర్యాటకశాఖ, నేషనల్ బుక్‌ట్రస్ట్ సంయుక్తంగా నిర్వహించిన ఈ బహుభాషా కవిసమ్మేళనానికి ఒక ప్రత్యేకత వుంది. ఇంగ్లీష్‌తో సహా ఆయా భారతీయ భాషాకవులు ఇటీవల కోణార్క్ సూర్య రథానికి సూర్య కవితలతో అక్షరార్చన చేసారు. ఈ కవి సమ్మేళనానికి ఆహ్వానించబడిన తెలుగు కవులు నిఖిలేశ్వర్ తన కవిత 'సూర్య శిల్పం' చదవగా, జయప్రభ తమ గీతం 'సూర్యోదయం'ను ఆలపించారు. భువనేశ్వర్‌కు 60 కి.మీ.దూరంలోవున్న కోణార్క్‌లోని యాత్రీనివాస్‌లో ఈ కవితాసదస్సు జరిగింది. ఒడియా సహా మొత్తం 15 భాషల్లోని 'సూర్య కవితల' ఇంగ్లీష్ అనువాదాలను కూడా వినిపించారు. వరసగా సమీర్ తంతి (అస్సామీ) కాజల్ చక్రవర్తి (బెంగాళీ) పద్మానచ్‌దేవ్ (డోగ్రీ) శివ్.కె. కుమార్, జయంత మహాపాత్ర (ఇంగ్లీష్) చంద్రకాంత్ దేవ్‌తాలే, క్షమాకేల్, ప్రభాత్ త్రిపాఠీ (హిందీ) కె.సచ్చిదానందన్ (మలయాళం) యొమ లెంచిమ్ ఇబోమ్చా (మణిపురి) నిరంజన్ ఉజగారే (మరాఠీ) టి.పాలమాలై (తమిళం) నిఖిలేశ్వర్, జయప్రభ (తెలుగు) బాలరాజ్ కోమల్ (ఉర్దూ)- ఈ భాషా కవుల మధ్య ఒడియా కవి రబీసింగ్, సౌభాగ్యమిశ్రా, హరిప్రసాద్ దాస్, ప్రతివ సత్‌పథి,ఉమాశంకర్ పండా, దిలీప్‌దాస్,ప్రసన్నకుమార్ మిశ్రా, బన్సీధర్ సారంగి, అశుతోష్ పండా తమ కవితలను పఠించారు. ఈ సందర్భంలో ఈ కవుల మూల భాషతోపాటు ఇంగ్లీషు, ఒడియా అనువాదాలను పొందుపర్చిన సంకలనాన్ని 'పొయమ్స్ఎట్ కోణార్క్' (Indian Poetry on sun & Konark)ను ఆవిష్కరించారు. నిఖిలేశ్వర్ చదివిన కవితను ఇక్కడ ఇస్తున్నాం.

## సూర్యశిల్పం

కాల కెరటాల ముద్దులతో
పరవశించిన
ఇసుక రేణువుల మధ్య
జీవనోత్సవ రథంపై
మహోజ్వల కోణార్కుడు!

ఒకింత మహా సముద్రాన్ని
సొంతం చేసుకుని
పరవళ్లు తొక్కుతున్న
అవిశ్రాంత అలల్లో
బంగారు బాటలు వేసి,
పగలు మాత్రమే
తూర్పు దిక్కున
పయనించే సూర్యుడు,
మానవ జీవన తీరంపై
నిరంతర కాంతి యాత్రలో
నిశ్చలన స్థితిలో
ఇక్కడ సూర్య శిల్ప రథం,
ప్రేమోద్రేకాల ఆలింగనంలో
అల్లుకున్న అర్కుడి
రక్తారుణ కిరణాల వెల్లువలో
శ్రమసాఫల్యం చెందిన
శిల్పుల జీవన సృష్టి
శతాబ్దాల తృప్తిలేని
కళాత్మక వారసత్వం!

– నిఖిలేశ్వర్